

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఆన్‌లైన్‌లో సొసైటీలు..



- ఇక...సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలు
- ఈకేవైసీ బాధ్యత సచివాలయాల సిబ్బందికి అప్పగింత
- జిల్లా వ్యాప్తంగా 1,15,363 మంది సభ్యులు
- ఇప్పటివరకు 94,835 మంది సభ్యులకు ఈకేవైసీ నమోదు
- ఈకేవైసీపై అవగాహన లేక ఇబ్బందులు



పి.గన్నవరంలో ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యుడికి ఈకేవైసీ

పి.గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు కూడా సాంకేతికతను అందిపుచ్చుకునేలా గ్రామీణ ప్రాంతాలలో రైతులకు సేవలందించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)ను సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఇప్పటికే ప్రతి పీఏసీఎస్‌లోను సీఎస్‌సీ ద్వారా 354 రకాల సేవలందించే దిశగా కార్యాచరణ రూపొందించింది. అయితే ఇతర బ్యాంకుల్లో ఆన్‌లైన్ ద్వారా అందించే సేవలు మాదిరిగా పీఏసీఎస్‌ల్లో కూడా అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇక సొసైటీల్లోను అన్నదాతలకు ఆన్‌లైన్ సేవలు అందనున్నాయి. దేశంలో ఎక్కడ నుంచి అయిన రైతులు బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు. సొసైటీల్లో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలందించాలనే లక్ష్యంతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణను చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఏవిధమైన అవకతవకలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకం రైతుకే నేరుగా అందించాలనే క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం రైతు ముంగిటకు ఆన్‌లైన్ సేవలు తీసుకువస్తుంది. ఈ క్రమంలోనే సొసైటీలో సభ్యత్వం కల్గిన ప్రతి సభ్యుడు (రైతు)కు ఆధార్‌కార్డు ఆధారంగా ఈకేవైసీని చేస్తున్నారు. మొదట్లో సొసైటీ సిబ్బంది కొంత మేర నమోదు చేసినప్పటికి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో గ్రామాలలో అవగాహన కలిగి ఉన్న సచివాలయం సిబ్బందికి ఈకేవైసీ బాధ్యత అప్పగిస్తూ జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో పూర్తి బాధ్యత తీసుకోవడంతో ఈకేవైసీ నమోదు ప్రక్రియ వేగవంతం అయ్యింది.

1,15,363 మంది సభ్యులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 166 సొసైటీలకు గాను 1,15,363 సభ్యులు ఉన్నారు. వారిలో ఇప్పటికే 94,835 మందికి ఈకేవైసీ పూర్తికాగా ఇంకా 20,528 మంది సభ్యులకు నమోదు చెయ్యాల్సి ఉంది. సభ్యులకు ఈకేవైసీ పూర్తయితే దేశ వ్యాప్తంగా ఎక్కడ నుంచి అయిన తమ సొసైటీలో జరిగే ప్రతి సేవను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది.

ఈకేవైసీపై అవగాహన లేక ఇబ్బందులు

సొసైటీ నుంచి జాబితా వచ్చిందని ఈకేవైసీ చేయించుకోవాలని సచివాలయం సిబ్బంది సభ్యులకు చెబుతున్నారు. అయితే మాకు సొసైటీలో ఏవిధమైన లోన్లు లేవని మేం ఎందుకు ఈకేవైసీ చేయించుకోవాలని సభ్యులు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. లోన్లు లేనప్పటికి సభ్యత్వం కలిగి ఉంటే చాలు ఈకేవైసీ చేయాలన్న విషయంపై సభ్యుల్లో అవగాహన లేక క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైతులు, సభ్యులకు అవగాహన కోసం కొన్ని సొసైటీలు గ్రామాలలో టాంటాం ద్వారా తెలియపరుస్తున్నారు. దీనికి తోడు సభ్యుల జాబితాల్లో గ్రామాంతరాలు, మృతిచెందిన వారు ఉండటంతో క్షేత్రస్థాయిలో ఈకేవైసీ నమోదుకు కొంతమేర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే అధికారులు నిరంతర పర్యవేక్షణతో ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం అయ్యింది. అయితే జిల్లా స్థాయి అధికారులు నుంచి జనవరి 1వ తేదీ కల్లా ఈకేవైసీని పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 82.21 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.





అయ్యో పాపం : ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇటీవల కాకినాడ సముద్ర తీరాన మృత్యువాత పడిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు

నో..లివ్!



తీరాన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత్యుఘోష

- గుడ్లు పెట్టేందుకు వచ్చి మృతి
- తీరం పొడవునా కళేబరాలు
- కాలుష్యమే కారణంగా అంచనా
- ఒక్కో తాబేలు 120 గుడ్లు
- అయినా అంతరించే ప్రమాదం
- డిప్యూటీ సీఎం పవన్ దృష్టి
- హోప్‌ఐలాండ్‌లో వేట నిషేధం
- కాపాడేందుకు చర్యలు

సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాగరతీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. వేల కిలోమీటర్ల నుంచి రాష్ట్ర తీరప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్లు సముద్రతీరంలో ఎక్కడ చూసినా చనిపోయిన దర్శనమిస్తున్నాయి. సముద్రంలో అరుదుగా లభించే జాతిగా పేరొందిన ఈ తాబేళ్లు విదేశాల నుంచి వేలాది కిలో మీటర్లు ఈదుకుంటూ వచ్చి తీరప్రాంతంలో గుడ్లు పెడతాయి. అలా వచ్చిన తాబేళ్లు చనిపోతుండడం కలవరానికి గురిచేస్తోంది. తీరప్రాంతాలకు ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన కాలుష్యం,వేటగాళ్ల వలలకు చిక్కుకోవడం, ఇంజన్ పంకాకు తాబేళ్లు తగిలి మృత్యువాత పడుతున్నట్టు అంచనా. దీనిపై ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్లను సంరక్షించాలని..మృతికి గల కారణాలు అధ్యయనం చేయాలని.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అటవీ అధికారులు కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణలో భాగంగా మార్చి వరకు చేపల వేట నిషేధించారు.

గుడ్లు పెట్టేందుకే రాక..

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా తదితర తీర ప్రాంత దేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కాకినాడ, కోనసీమ, బాపట్ల, నెల్లూరు తీర ప్రాంతాలకు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు వస్తాయి. ఇవి రాత్రి సమయంలో తీరంలోని సముద్ర ఇసుకలోకి వచ్చి గోతులు తయారు చేసుకుని, వాటిలో ఒక్కో ఆడ తాబేలు 60 నుంచి 120 వరకు గుడ్లు పెడుతుంటాయి. గుడ్డు నుంచి పిల్లలగా మారేందుకు 50 రోజుల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్లు పెట్టేందుకు ఒక్కో గొయ్యి కోసం ఇవి సుమారు గంట వరకు సమయం తీసుకుంటాయి. జనసంచారం, జంతువుల సంచారం లేని రాత్రి సమయంలో ఇవి ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడతాయి. అయితే జిల్లాలో అద్దరిపేట సముద్ర తీరం నుంచి కాకినాడ తీరం వరకు 35 కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు దర్శనమిస్తున్నాయి. ఉప్పాడ, కాకినాడ రూరల్ నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, కుంభాభిషేకం బీచ్‌లో తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తోండడం ఆందోళన కలిగిస్తోంది. సముద్ర తీరం ఆనుకుని ఉన్న పలు పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య కారకాలతో ఇవి మృతి చెందుతున్నాయి. మత్స్యకారులు ఇంజన్ బోట్లతో చేపల వేటకు వెళ్లే సమయంలో వలలో చిక్కుకోవడం, ఇంజన్ బోటు పంకాల్లో పడి ఇవి మృత్యువాత పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

జెల్లీ చేపలే ఆహారం..

సముద్ర పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రంలో ఆక్సిజన్, చేపల సంతానం వృద్ధికి తాబేళ్లు దోహదం చేస్తాయి.సముద్రంలో ఉండే చేపపిల్లలను ఆహారంగా తీసుకుని జీవించే జెల్లీ చేపలను తాబేళ్లు ఆహారంగా తీసుకుంటాయి.దీంతో మత్స్య సంపద అంతరించకుండా వృద్ధి అయ్యేలా పరోక్షంగా కీలకపాత్ర పోషిస్తాయి. తాబేలు లోతులో ఉన్నా ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సముద్రం పైకి వచ్చి ఆక్సిజన్ విడుదల చేస్తుంది. అలా సముద్రం పైకి, లోపలికి వచ్చి, వెళ్లడం ద్వారా నీటిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. సముద్ర పర్యావరణాన్ని కాపాడేందుకు తాబేళ్లు మేలు చేస్తాయి.


అరుదైన జాతి..అయినా!



ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అంతరించుకుపోతున్న అరుదైన తాబేళ్ల జాతిగా ప్రపంచ పర్యావరణ నిపుణులు ప్రకటించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు 7 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో ఐదు రకాలు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నాయి. రెండు అడుగుల వెడల్పుతో ఉండే ఈ తాబేలు 50 కిలోల బరువు ఉంటుంది. ఇవి 20 వేల కిటోమీటర్లు దూరం ప్రయాణించి తీరానికి వస్తున్నాయి.గుడ్డు నుంచి పిల్లగా ఎదిగిన ఈ తాబేళ్లు ఎక్కడికి వెళ్లినా తిరిగి ఇక్కడికే వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకత. దేశంలో ఒడిశా తర్వాత ఈ తాబేళ్లు రాష్ట్రంలోకి అధికంగా రావడం, గుడ్లు పెట్టడం వెళ్లిపోవడం జరుగుతుంటుంది. బాపట్ల సూర్యలంక, గుంటూరు జిల్లా నిజాంపట్నం,నాగాయలంక జింకపాలెం, కృష్ణా జిల్లా కోడూరు, కాకినాడ తీరంలో ఉప్పాడ, కాకినాడ, హోప్‌ఐలాండ్, కోరంగి అభయారణ్యం తదితర సముద్రతీర ప్రాంతాలకు ఆలివ్ రిడ్లీ తాబేళ్లు ఎక్కువగా వస్తుంటాయి.



చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించి తిలకిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేంద్రమణి



చిత్రకళా బ్రహ్మోత్సవం

ఊహల ఊయలలో చిత్రకారులు తపస్సు చేశారు. మరుక్షణం మది నుంచి చెదిరిపోయే ఊహలకు యజ్ఞకర్తలుగా మారి చిత్రరూపమిచ్చారు. చిత్రకళా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎన్నో అద్భుత చిత్రాలను కాన్వాసులపైకి ఎక్కించి కళాతృష్ణను తీర్చుకున్నారు. కోనసీమ చిత్రకళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో చిత్రకళా బ్రహ్మోత్సవం ఘనంగా ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాలకు చెందిన చిత్రకారులు హాజరై తమ చిత్రాలను ప్రదర్శనలో ఉంచి చిత్రకళాభిమానులు చేత ఔరా అనిపించుకున్నారు. ఎన్నెన్నో ప్రశంసలు అందుకున్నారు..

వార్త..6లో

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి..

6లో

చేతిని కోల్పోయిన చిన్నారి..

తల్లికి తీవ్రగాయాలు..గోడిలో విషాదం

సూసైడ్ నోట్ రాసి వైద్య విద్యార్థి ఆత్మహత్య

6లో

హోరాహోరీగా..

రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్



కిమ్స్ క్రీడా ప్రాంగణంలో మ్యాచ్

అమలాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండోరోజు రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ హోరీహోరీగా సాగింది. కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కాకినాడ రుద్రాస్ జట్టు రాజోలు టీమ్‌తో తలపడగా కాకినాడ రుద్రాస్ జట్టు విజయం సాధించింది. వైజాగ్ లయన్స్ జట్టు రాజమహేంద్రవరం జట్టుతో తలపడగా రాజమహేంద్రవరం జట్టు విజయం సాధించింది. అన్నవరం జట్టు కాట్రేనికోన జట్టుతో తలపడగా అన్నవరం జట్టు విజయం సాధించింది. అన్నవరం జట్టు క్రీడాకారుడు సుబ్బారావు ఈ టోర్నమెంటులో తొలిసారిగా వంద పరుగులు పూర్తి చేయడంతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సుబ్బారావుకు ముఖ్య అతిథిగా హాజరైన సత్తిరాజుస్వామి షీల్డు అందజేసి అభినందించారు. ఈ పోటీలను క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఉపద్రష్ట నాగార్జున, పెద్దింటి అక్షయ్, ఉపద్రష్ట విజయాదిత్య, కర్రా బాబి, మహేంద్రాదిత్య, గండికోట సాయి పర్యవేక్షించారు.

నేటి నుంచి గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు

కలెక్టర్ మహేష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పశు సంపదను వృద్ధి చేయడంతో పాటు పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఉచిత పశువైద్య శిబిరాల వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. పశువైద్య శిబిరాల ద్వారా పశు వైద్య చికిత్సలు, నట్టల నివారణా మందు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు అందించడంతో పాటు శాస్త్రీయ యాజమాన్య విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ పశు వైద్యులతో పాటు పారా పశువైద్య సిబ్బందితో కూడిన బృందాలు వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. వైద్య బృందాలు శిబిరాలు నిర్వహిస్తూ గొర్రెలు, మేకలు, లేగదూడలకు నట్టల నివారణ మందు ఉచితంగా అందిస్తారన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థికసాయం తదితర అంశాలను రైతులకు వివరిస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణ, పశుసంపద వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లాలోని పశువుల ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, గ్రామీణ పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నట్టు ఆయన వివరించారు. ఆయన వెంట వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మినీ గోకులాల నిర్మాణంలో జిల్లాకు 7వ స్థానం

'పల్లె పండుగ' రోడ్ల నిర్మాణంలో 3వ స్థానం



మినీ గోకులం షెడ్డు



మండపేట మండలం ద్వారపూడి బంగారమ్మ కాలనీలో సీసీ రోడ్డు

మండపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడి రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులాల నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గోకులాల నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఈ పథకం ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మినీ గోకులాలు నిర్మాణానికి అనుమతులు ఇవ్వటంతో పాడి పశువుల రైతులు వీటిని నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. కోనసీమ జిల్లాకు 879 మినీ గోకులాలు మంజూరైతే ఇప్పటివరకు 310 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. రాష్ట్రస్థాయిలో జిల్లా గోకులాల నిర్మాణంలో 7వ స్థానంలో నిలిచిందని జిల్లా ఉపాధి హామీ పీడీ మధుసూదన్ తెలిపారు. అలాగే మిగిలిన మినీ గోకులాల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఇక 100 రోజులు పల్లె పండుగ వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 740 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటివరకు అందులో 400 కిలోమీటర్లకు పైబడి సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో కోనసీమ జిల్లా 3వ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అలాగే జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024-2025 సంవత్సరంలో రూ.100 కోట్ల మేర పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే రూ.60 కోట్లకు పైబడి సీసీ రోడ్లు గోకులాలు, గ్రావెల్, మెటల్ రోడ్ల పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలో సీసీ రోడ్లు 740 కి.మీ, గ్రావెల్ రోడ్లు 7 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మొత్తం మీద పల్లె పండుగ రోడ్ల నిర్మాణంలో జిల్లాకు మూడో స్థానం, మినీ గోకులాల నిర్మాణంలో 7వ స్థానం దక్కిందని పీడీ మధుసూదన్ చెప్పారు.

రేషన్ డీలర్ల ఎంపికకు ప్రవేశ పరీక్ష

అమలాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఖాళీ అయిన రేషన్ షాపులతో పాటు ఎక్కువ కార్డులు ఉన్న షాపుల విభజనతో ఏర్పడ్డ 490 చౌకధరల దుకాణాలకు రేషన్ డీలర్ల ఎంపిక కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ్‌భాస్కర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మార్గదర్శకాలకు అనుగుణంగా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించామన్నారు. రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం రెవెన్యూ డివిజన్ల వారీగా రాత పరీక్షను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. రాతపరీక్షకు 80 మార్కులు, ఇంటర్వ్యూకు 20 మార్కులు ఉంటాయన్నారు. రాత పరీక్ష నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంతో పాటు మండల విద్యాశాఖాధికారులు సహకారం అందించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంటర్వ్యూల అనంతరం అర్హత సాధించిన వారికి రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామని ఆర్డీవో తెలిపారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాతపరీక్షను ఆర్డీవో కె.మాధవి, రామచంద్రపురంలో ఆర్డీవో డి.అఖిల పరిశీలించారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 103 షాపులకు సంబంధించి 253 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆర్డీవో మాధవి తెలిపారు. వీరిలో అర్హులైన వారిని 189 మందిని గుర్తించామన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బందా ఆర్.కామేశ్వరరావు పర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించగా 184 మంది హాజరైనట్టు ఆర్డీవో తెలిపారు.

చిత్రం.. భళారే విచిత్రం

● అమలాపురంలో వైభవంగా ప్రారంభమైన అంతర్జాతీయ చిత్రకళా బ్రహ్మోత్సవం
● పాల్గొన్న ప్రముఖులు
● అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్రకళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కొరసాల సీతారామస్వామి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన వైభవంగా జరిగింది. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రదర్శనను ప్రారంభించారు. చిత్రకళా బ్రహ్మోత్సవం వేడుకలను చేనేత కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, రంకిరెడ్డి కాశి, సూదా గణపతి వంటెద్దు వెంకన్నాయుడు, కౌన్సిలర్ మట్టపర్తినాగేంద్ర పాల్గొన్నారు. బాపు చిత్రకళా ప్రదర్శనను గంధం కె.దుర్గాప్రసాద్, వడ్డాది పాపయ్య చిత్రకళా ప్రదర్శనను సుంకర చలపతిరావు, నీలి వెంకటరమణ చిత్రకళా ప్రదర్శనను అబ్దుల్ రజాహుస్సేన్, వీకేఆర్ శర్మ (డిజిటల్ రవి) ఛాయాచిత్ర ప్రదర్శనను కె.వెంకటభూపేష్ ప్రారంభించారు.



యుద్ధరంగంలో ధీరవనిత


ఊహ నిజమౌతున్న వేళ

బహుమతి ప్రదానోత్సవం..

చిత్రకళా బ్రహ్మోత్సవంలో భాగంగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 34వ వార్షికోత్సవానికి సంబంధించి కర్ణాటక రాష్ట్రం దార్వాడకు చెందిన దేవేందర్ ఎం.బాడీగర్‌కు భారత చిత్రకళారత్న గోల్డెన్ అవార్డుతో పాటు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మెట్ల సత్య చేతులమీదుగా విజేతలకు అమరావతి చిత్రకళారత్న గోల్డెన్ అవార్డు, మెగా గోల్డెన్ పద్మ అవార్డ్స్, బెస్ట్ గోల్డెన్ పద్మఅవార్డు, సూపర్ గోల్డెన్ పద్మఅవార్డు, ఆర్ట్ లెజెంట్ గోల్డెన్ పద్మ అవార్డులను 391 మందికి అందజేశారు. 35వ వార్షిక ప్రదర్శనలో జార్ఖండ్‌కు చెందిన రాజీవ్ అగర్వాల్, వినుకొండకు చెందిన జస్టిస్ వజ్రగిరి, మహారాష్ట్రకు చెందిన హేమ కుట్నీకర్‌లకు భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవం అవార్డులతో పాటు ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మొత్తంగా 675 మందికి అవార్డులు, రివార్డులు అందించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్, డాక్టర్ బసవా వరహాలు, శిల్పి రాజ్‌కుమార్ వడయార్, డాక్టర్ గోదశి గంగరాజు, పోలిశెట్టి అనంతలక్ష్మి, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు డాక్టర్ శ్యామ్‌జాదూగర్ బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్‌లో చేసిన మేజిక్ ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినొందిన ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో ముద్రించిన అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఐవీ ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు బత్తుల బాపూజీని కోనసీమ చిత్రకళాపరిషత్ తరపున చిత్రకళా సామ్రాట్ బిరుదుతో సత్కరించారు.


ముద్దుకే ముద్దొచ్చే సింగారం


గరగ నృత్యం


వెలుగులు నిండాలి


తాతా మనుమడి ఆప్యాయత


శ్యామ్ జాదూగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ


భారత చిత్రకళారత్న అవార్డు గెలుచుకున్న విజేత బాడీగర్‌కు సన్మానం

విద్యార్థులు క్రీడల్లో పట్టు సాధించాలి

'శ్రీప్రకాష్'లో మూడోరోజు జాతీయస్థాయి చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో మంచి పట్టు సాధించాలని ప్రముఖ వ్యాపారవేత్త కె.రాజేష్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మూడవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెస్ క్రీడను ప్రోత్సహించేందుకు శ్రీప్రకాష్ పాఠశాల చేస్తున్న కృషి ఎంతో సంతోషదాయకమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేధాశక్తిని పెంపొందించడంలో చెస్‌కు మించిన క్రీడ మరొకటిలేదన్నారు. అలాగే ఇంటర్‌నేషనల్ అర్బిటర్ అరసును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన పోటీలను తిలకించారు. ఈకార్యక్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ, కార్యదర్శి ఏసీఏ అడుసుమిల్లి సురేష్, అనంతరామ్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు ఉన్నారు.


చెస్ పోటీలను తిలకిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

భీష్మ ఏకాదశికి మెరుగ్గా ఏర్పాట్లు

● సుమారు 70వేల మంది వస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా
● తొక్కిసలాట జరగకుండా ఎక్కడికక్కడ భక్తులకు హోల్డింగ్ పాయింట్లు
● అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమీక్ష


సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

అన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి భీష్మ ఏకాదశి పర్వదినాన వేలాదిగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆదివారం సిబ్బందితో సమీక్షించారు. ఈ ఏడాది కార్తీకమాస ఏర్పాట్లు బాగున్నాయని, వాటికంటే మెరుగ్గా ఉండాలని చైర్మన్ రోహిత్ సూచించారు. భీష్మ ఏకాదశి పర్వదినం ఫిబ్రవరి 8 కాగా 7వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించాలని, ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. సుమారు 70వేల మంది వరకు దర్శనానికి విచ్చేస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రవాణా, తాగునీరు, పారిశుధ్యంపై దృష్టిసారించి ఎవరికీ ఇబ్బంది రాకుండా చూడాలని ఈవో ఆదేశించారు. అదనపు బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. భక్తులకు వ్రతం, దర్శన సమయంలో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటుచేసి రద్దీకి అనుగుణంగా వాటి నుంచి వ్రత మండపాలు, దర్శన క్యూలైన్లలోకి పంపించాలని సూచించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రధానంగా ఆన్‌లైన్ పేమెంట్ కౌంటర్ల వద్ద సుశిక్షితులైన వారిని నియమించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు ఉచిత అన్నప్రసాద సమయంలో ఎక్కువసేపు వేచిఉండకుండా మొదటి అంతస్తులో అందించే ఏర్పాట్లపై చర్చించారు. అతి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని ఈవో చెప్పారు. సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని నిర్ణయించారు. సమావేశంలో సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవోలు కొండలరావు, ఎల్.శ్రీనివాస్, కృష్ణారావు, జగ్గారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు, సూపరింటెండెంట్లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, కృష్ణప్రసాద్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

నాన్న, అమ్మా క్షమించండి!

సూసైడ్ నోట్ రాసి వైద్య విద్యార్థి ఆత్మహత్య

స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు


సాయి మణిదీప్(ఫైల్)

నెల్లిమర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థి ఆత్కూరి సాయిమణిదీప్ (24) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తను ఉంటున్న హాస్టల్ గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ సూసైడ్ నోట్ రాసి అందులో డాడీ, అమ్మా, తమ్ముడూ నన్ను క్షమించండి అంటూ కోరాడు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన సాయిమణిదీప్ నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ గదిలో మణిదీప్‌తో ఉంటున్న తోటి విద్యార్థులు పండుగకు స్వగ్రామాలకు వెళ్లారు. ఇంకా రాలేదు. శనివారం రాత్రి 7 గంటల వరకు పక్క రూమ్ విద్యార్థులతో మాట్లాడి తలుపులు వేసుకున్న మణిదీప్ ఆదివారం ఉదయం 10 గంటల వరకు బయట కురాలేదు. పక్క రూమ్ వి ద్యార్థులకు సందేహం కలిగి కిటికీలో నుంచి చూశారు. మంచంపై లేకపోవడంతో గదిలోకి వెళ్లి పరిశీలించారు. బాత్‌రూమ్‌లో అచేతనంగా పడి ఉన్నట్లు గుర్తించారు. విషయం యాజమాన్యానికి తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడున్న ఆధారాల ఆధారంగా గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మణిదీప్‌కు బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్ ఉండి పోయాయి. ఆ పరీక్షలు రాసేందుకు పండుగకు ఇంటికి వెళ్లలేదు. హాస్టల్‌లోనే ఉండిపోయాడు. ఓ పక్క ఏకాంతం, మరో పక్క మానసిక సంఘర్షణ కలిసి ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చు. కళాశాల యాజమాన్యం, పోలీసులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు ఆత్కూరి శిరీష, ఆత్కూరి రామారావు, బంధువులు ఆదివారం సాయంత్రానికి నెల్లిమర్ల చేరుకుని భోరున విలపించారు. తండ్రి రామారావు నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో వికాస్ విద్యాసంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా మణిదీప్ పెద్ద కుమారుడు. చిన్న కుమారుడు గౌరీనంద్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు.

కన్నీరు తెప్పిస్తున్న సూసైడ్ నోట్

సాయి మణిదీప్ మృతదేహం వద్ద పోలీసులకు లభించిన సూసైడ్ నోట్‌లోని అంశాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. "డాడీ, అమ్మా, నన్ను క్షమించండి. గత పదేళ్లుగా మిమ్మల్ని చాలా చాలా కష్టపెట్టాను. బాధ పెట్టాను. నా వల్లే ఇంట్లో సంతోషం, ప్రశాంతత లేదు. నా వల్లే మీ ఆరోగ్యం కూడా బాగుండట్లేదు. ఎంత కష్టపడి చదువుదాం అన్నా చదవలేకపోతున్నా. రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. గత 8-9 నెలల నుంచి సూసైడ్ ఆలోచనలు తినేస్తున్నాయి. కానీ ఎవరికీ చెప్పలేను. నా వల్ల తమ్ముడు కూడా చాలా బాధపడుతున్నాడు. ఇంట్లో పరిస్థితుల వల్ల నాకు నేనే పిచ్చోడిలా అనిపిస్తున్నా. అమ్మా నా కోసం ఎంతో చేశారు. నేను మాత్రం మిమ్మల్ని బాధలు పెడుతూనే ఉన్నా. మీ నిద్ర, ఆరోగ్యం అన్నీ నా వల్లే పోతున్నాయి. బతకాలి అంటే భయమేస్తోందమ్మా. నా గురించి కాదు, ఇంకా ఎంత కాలం మిమ్మల్ని బాధ పెడతా అని, మీరు ఆనందంగా ఉండటమే నాకు కావాలి. డాడీ, అమ్మా నన్ను క్షమించండి" అని సాయి మణిదీప్ ఆ లేఖలో రాశాడు.

మిమ్స్‌లో విషాదం

మిమ్స్‌లో వైద్య విద్యార్థి సాయిమణిదీప్ ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తోటి విద్యార్థులు సైతం కన్నీరుమున్నీరయ్యారు. మణిదీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరు పెట్టిస్తూ... సందేశాన్ని ఇస్తూ...

భోగాపురంలో ఆలోచింపజేసిన నాటికలు


చీకటి బతుకులు నాటికలోని దృశ్యం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీతో మంచి చెడు ఉంది. దానిని ఉపయోగించే తీరుపై అది ఆధారపడి ఉంటుంది. రైతుల జీవితాల్లో అప్పుల కష్టాలు భాగమయ్యాయి. అవి వారి ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నాయి. ప్రభుత్వాలు సకాలంలో ఆదుకుంటే వారి బతుకులు బాగవుతాయి అంటూ కన్నీరు పెట్టిస్తూ సందేశాత్మకంగా సాగాయి కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో మూడో రోజు ప్రదర్శనలు. హైదరాబాద్‌కు చెందిన యువభేరి ఆర్ట్స్ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక టెక్నాలజీ మన జీవితాల్లో తెచ్చిన మార్పులను సవివరంగా చాటిచెప్పింది. ఈ రోజుల్లో ఎవరికి వారు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో బిజీబిజీగా గడుపుతూ బంధాలు, అనుబంధాలకు దూరమై ఒంటరి వారైపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మిత్రుడు లేడు. అలా కాకుండా ఏదో ఒకటి చేస్తూ అవసరం లేకున్నా దానిపైనే గడుపుతూ ఉంటే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఈ నాటిక ద్వారా వివరించారు. ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.


నా శత్రువు నాటికలోని ఓ సన్నివేశం

రైతుల జీవితాల్లో...

రైతుల జీవితాల్లో సుఖదుఃఖాలు కలిసిమెలిసి ఉంటాయి. పంట పెట్టుబడులు కోసం రైతులు చేసే అప్పులే గుదిబండగా మారి వారి ప్రాణాలు తీసుకుంటున్నాయని కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన జీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు ప్రదర్శించిన చీకటి బతుకులు నాటిక ద్వారా తెలియజెప్పారు. ఈ నాటిక ఆద్యంతం ప్రేక్షకుల కంట కన్నీరు పెట్టించింది. తమ జీవితాల మాదిరిగా ఉన్న ఈ నాటిక అందరిని ఆలోచింప చేసింది. జీఆర్ వెంకటేశులు ఈ నాటికను రచించి దర్శకత్వం వహించారు.

ఈస్టిండియా పాలనలో..

కలకత్తా కేంద్రంగా ఈస్టిండియా పరిపాలన సమయంలో 1840లో జరిగిన సంఘటన ఆధారంగా హైదరాబాదులోని తెల్లాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కు సంకెళ్లు నాటికను ప్రదర్శించారు. ఉక్కు సంకల్పం ఉంటే ఎవరైన దిగిరావాల్సిందే అని ఈ నాటిక ద్వారా చాటి చెప్పారు. ఈ నాటికను సింహప్రసాద్ రచించగా ఉప్పలూరి సుబ్బరాయశర్మ దర్శకత్వం వహించారు.

జీవితకాల సాధన పురస్కారం అందజేత

ప్రముఖ రచయిత, నటుడు, నంది అవార్డు గ్రహీత తాళాబత్తుల వెంకటేశ్వరరావును అడపా అచ్చియమ్మ, మాణిక్యం స్మారక జీవితకాల సాధన పురస్కారంతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు



గాడ్ వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గరికపాటి, వక్తలు.. మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

రాయవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. ఆదివారం గాడ్ 89వ జన్మదిన వేడుకలు పీఠం వద్ద ఉన్న సీతా సదనంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు యర్రాప్రగడ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు కృషి చేయడం సంతోషకరమని, హిందూ ధర్మవ్యాప్తికి మరింత కృషిచెయ్యాలని పిలుపునిచ్చారు. గాడ్ ఆధ్యాత్మిక సేవల ద్వారా తాను పుట్టిన ప్రాంతానికే కాకుండా తెలుగురాష్ట్రాల్లో పేరు పొందారన్నారు. భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతిమనిషి దైవరాధన చేయడం ద్వారానే ఉత్తమ జీవనం సాగించడం సాధ్యమౌతుందన్నారు. సహస్రవాధాని గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషి కష్టాలకు కుంగిపోకుండా దైవం మీద నమ్మకంతో ముందుకు సాగాలని భగవంతుడ్ని నమ్ముకున్నవారికి ఎటువంటి కష్టాలు దరిచేరవన్నారు. ఈసందర్భంగా కోట శ్రీను దత్త రచించిన గాడ్ వైభవం పుస్తకాన్ని, పోస్టల్‌శాఖ ద్వారా తయారు చేసిన గాడ్ చిత్రంతో ఉన్న 5రూపాయిల స్టాంప్‌ను గరికపాటి, చిలకపాటి విజయ రాఘవాచార్యులు, తుమ్మిడి రామ్ కుమార్, ప్రసార భారతి విశ్రాంత డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు ఆవిష్కరించారు. శ్రీరంగం దేవస్థానం ఆచార్యులు పరాశర లక్ష్మి నరసింహ భట్టర్ గాడ్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, కోట సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో కవులు సాహిత్తివేత్తలను గాడ్ సమక్షంలో ఘనంగా సత్కరించారు. హైదరాబాదుకు చెందిన యువకుడు వారణాసి రాఘవను పీఠం ఆస్థాన విద్యాన్‌గా నియమించడం తో పాటు సంగీత విద్యన్ మణి బిరుదుతో సత్కరించారు.

గాడ్ ఆశీస్సులు పొందిన ప్రముఖులు

గాడ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి గాడ్‌ను సత్కరించి ఆశీస్సులు పొందారు. డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, డాక్టర్ విశ్వనాధ గోపాలకృష్ణ, డాక్టర్ గన్ని భాస్కరరావు, తుమ్మిడి రామ్‌కుమార్, మేడసాని మోహన్, అన్నవరం దేవాస్థానం ఈవో డి.సుబ్బారావు, గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి నృత్య కళాకారుడు సప్పా దుర్గా ప్రసాద్ గాడ్ ఆశీస్సులు పొందారు.


లిఫ్ట్ ఇస్తానని బంగారం దోచుకెళ్లాడు


వృద్ధురాలి మెడలో ఆభరణాల చోరీ

అనపర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బస్సు దిగి నడిచి వెడుతున్న వృద్ధ దంపతులను లిఫ్ట్ ఇస్తానని నమ్మించి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన సంఘటన అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం కొప్పవరం రోడ్డులో శనివారం జరిగింది. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన వృద్ధ దంపతులు సబ్బెళ్ల వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ కాకినాడలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో లక్ష్మీనరసాపురం వంతెన వద్ద బస్సు దిగి కొప్పవరానికి నడిచి పయనమయ్యారు. కొంతదూరం వెళ్లిన తరువాత మోటారుసైకిల్‌పై వచ్చిన దుండగుడు వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను మోటార్ సైకిల్‌పై కొంతదూరం తీసుకువెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రదేశంలో బండి ఆపి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రాలతో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు, నల్లపూసల దండతో సహా 8 తులాల బంగారంతో ఉడాయించాడు. వెంకటరెడ్డి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

అయ్యో.. ఐదేళ్ల పాపకు ఎంత కష్టం

● విద్యుత్ షాక్‌తో చేయిని కోల్పోయిన కూతురు ● తల్లికి తీవ్రగాయం



చేయిని కోల్పోయిన కేతా లాస్యమాధురి


గాయపడ్డ రమాదేవి

అల్లవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో తల్లి కేతా రమాదేవి డాబాపై దుస్తులు ఆరవేస్తుండగా ఆడుకునేందుకు డాబా పైకి వచ్చిన ఐదేళ్ల కూతురు కేతా లాస్యమాధుని విద్యుత్ తీగ వల్ల షాక్‌కు గురై శనివారం తీవ్రంగా గాయాలపాలైంది. సంక్రాంతి సెలవులకు కాకినాడ నుంచి గోడి వచ్చిన లాస్యమాధురి డాబాపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ విద్యుత్ ప్రమాదానికి గురైన సమయంలో కుమార్తెను రక్షించబోయిన తల్లి రమాదేవి కూడా తీవ్రంగా గాయపడింది. తల్లీకూతుళ్లను కాకినాడ జీజీహెచ్‌కు తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. తీవ్రంగా గాయపడిన లాస్యమాధురి కుడి చేతిని శస్త్రచికిత్స చేసి కాకినాడ జీజీహెచ్ వైద్యులు తొలగించారు. తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి, తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే చిన్నారి లాస్యమాధురి చేతిని కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లీకూతుళ్ల విద్యుత్ ప్రమాదానికి గురైన సంఘటన గోడి గ్రామాన్ని కుదిపివేసింది. నివాస ప్రాంతాల్లో ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ సంఘటనపై అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

బంధువుల ఇంట ఫంక్షన్‌కు బయల్దేరి..

ట్యాంకర్ లారీ ఢీకొనడంతో యువకుడు మృతి


శివ మృతదేహం వద్ద విలపిస్తున్న అత్త నారాయణమ్మ

ప్రత్తిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కథనం మేరకు ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22)తునిలో బంధువుల ఇంట జరిగే ఫంక్షన్‌కు బయల్దేరగా అతడి వెనుక బావ గొంప భాను, భాను తల్లి నారాయణమ్మ రెండు వేర్వేరు మోటార్ బైక్‌లపై బయల్దేరారు. ధర్మవరం పెట్రోల్‌బంకు సమీపంలో హోండా ప్యాషన్‌ప్లస్ బైక్‌పై వెళ్తున్న రాజమాణి శివను వెనుక నుంచి ట్యాంకర్ లారీ పక్కనే మరో లారీ ఓవర్ టేక్ చేస్తూ శివ బైక్‌ను ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే శివ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు...

ఏలేశ్వరం మండలం పేరవరంలో వ్యవసాయ కూలి పనులు, మేకలు, గొర్రెలు పెంపకం పనులు చేసుకునే రాజమాణి శ్రీను, రమణమ్మలకు శివ, మరో అబ్బాయి సంతానం. కూలిపనులు చేస్తూ కుటుంబ పోషణలో చేతికి అందివచ్చిన శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటం పట్ల కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలం వద్ద మృతుడి బావ, అత్త నారాయణమ్మ షాక్‌తో విలవిల్లాడారు.

వెంకన్న ఆదాయం రూ.5.12లక్షలు
ఆత్రేయపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,12,580 లభించిందని ఈవో తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు
మామిడికుదురు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదుచేసినట్టు నగరం హెచ్‌సీ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. పదో తరగతి చదువుతోన్న తమ కుమార్తె ఆదివారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

పి.గన్నవరం - అంబాజీపేట రహదారి మూత

- 4రోజుల తర్వాత ఆర్టీసీ బస్సులు మళ్లింపు
- ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లింపు
- సీసీ రోడ్డు నిర్మాణం కోసం నెల రోజులు దశల వారీగా రహదారి బంద్


పి.గన్నవరం-అంబాజీపేట రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్న దృశ్యం

పి.గన్నవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అంబాజీపేట రహదారి అభివృద్ధిలో భాగంగా సోమవారం నుంచి దశలు వారీగా నెలరోజులు రాకపోకలను బంద్ చేస్తున్నట్లు ఆర్ అండ్‌బి డీఈ రాజేంద్ర తెలిపారు. పి.గన్నవరం మూడు రోడ్ల కూడలి నుంచి అంబాజీపేట వరకు రూ.8కోట్ల నిధులతో చేపట్టిన రహదారి పనుల్లో 975మీటర్ల సీసీ రోడ్డు, పోతవరం వద్ద 375మీటర్లు మేర రోడ్డు, బెర్మ్ పనులు మినహా దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. పి.గన్నవరం సెంటర్ నుంచి పోతవరం వరకు 975 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం కోసం రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు. అక్విడెక్టు నుంచి గంటి రోడ్డు వరకు సీసీ రోడ్డు ఒక పక్క మాత్రమే పూర్తయిందని, అంతర్వేది ఉత్సవాలు నేపథ్యంలో ఫిబ్రవరి రెండో వారం తరువాత మిగిలిన రోడ్డు పూర్తిచేస్తామన్నారు. కాగా పోతవరం రహదారి కుంగిన చోట(375 మీటర్లు) మట్టి పరీక్షలు నిర్వహించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలా లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలా అనే విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని ఆయన చెప్పారు. అలాగే పంచాయతీ రోడ్డులో సోమవారం నుంచి సీసీ రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. అంబాజీపేట వైపు వెళ్లే ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రత్యామ్నాయ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాలని ఆయన కోరారు. ఐదు రోజులు తర్వాత ఆర్టీసీ బస్సులను రూట్ మళ్లిస్తామని చెప్పారు. కాగా పి.గన్నవరం-అంబాజీపేట రహదారి మూత కారణంగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు విషయమై రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మను వివరణ కోరగా రహదారి బంద్ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు నుంచి మాకు ఏవిధమైన సమాచారం రాలేదన్నారు.

రక్షణ గట్టుకు తూట్లు.. ఇసుకతువ్వ అక్రమ రవాణా

- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్, హెడ్‌వర్క్స్, మైన్స్ అధికారులు


జి.మూలపొలం వద్ద ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతం


ఇసుక లోడింగ్ దృశ్యం

ఐ.పోలవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఐలెండ్ ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న ఏటిగట్లకు తూట్లు పడుతున్నాయి. టిప్పర్ల ద్వారా తువ్వమట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. అధికార పార్టీనాయకుల అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. నిబంధనలను అతిక్రమించి గోదావరికి అతి దగ్గరలో తువ్వమట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం కన్నెత్తి చూడటంలేదు. జి.మూలపొలం వద్ద తమ కార్యకలాపాల కోసం ఓఎన్జీసీ రైతుల నుంచి భూమిని లీజుకు తీసుకుంది. ఆ భూమిని మెరక చేసేందుకు మేకా సంస్థకు కాంట్రాక్టుకు ఇచ్చారు. ఆసంస్థ గోదావరిలో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తీసి మెరక చేశారు. కార్యకలాపాల అనంతరం భూమిని తిరిగి రైతులకు అప్పగించారు. అయితే ఇసుకతో మెరక చేసిన భూమిని తవ్వి లారీల ద్వారా మట్టిని తరలించే క్రమంలో ఏటిగట్టును ధ్వంసం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానిక రైతులు లారీలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, హెడ్‌వర్క్స్, మైన్స్ యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడవంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నార్త్ అద్దాలు కాల్వ వద్ద ఓఎన్జీసీ నిర్మించిన ఐరన్ వంతెన తుప్పు పట్టి శిధిలావస్థకు చేరింది. ఈవంతెన ద్వారా ఇసుక లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రమాదకరంగా మారింది. దెబ్బతిన్న రహదారిని ఓఎన్జీసీ ద్వారా ఆధునికీకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి రవాణా నిలువరించకపోతే ఉద్యమిస్తామని నాలుగు గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఏపీ టీఎఫ్ జిల్లా కార్యాలయం ప్రారంభం


ముమ్మిడివరంలో ఏపీ టీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన బాలయోగి

ముమ్మిడివరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులకు ఏ సమస్యలున్నా పరిష్కారానికి ఏపీ టీఎఫ్ సిద్ధంగా ఉంటుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని సంఘ గౌరవ సలహాదారు ఎం.బాలయోగి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశానికి మునేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలో 22మండలాల్లో ఉపాధ్యాయులకు ఏ సమస్యలున్నా వాటిని ముందుండి పరిష్కరిస్తామన్నారు. డీఈవో కార్యాలయంలో అందించాల్సిన ఫారమ్స్‌ను తమ కార్యాలయంలో అందిస్తే వాటిని డీఈవో కార్యాలయంలో అందించడానికి తాము సిద్ధంగా ఉంటామన్నారు. ఇన్‌కమ్‌ట్యాక్స్, పీఎఫ్, ఏపీ జీఎల్ఐ తదితర ససమస్యలకు ఏపీటీఎఫ్ కార్యాలయంలో సంప్రదించవచ్చునని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి యూవీ వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, సంఘ గౌరవాధ్యక్షుడు నాగాబత్తుల నరసింహమూర్తి, అదనపు కార్యదర్శి గుత్తాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోర్త రాజశేఖర్, ఎన్వీ రమణ, మడికి నాగభూషణం, పినిపే కృష్ణమూర్తి, పీతల రాంబాబు, పి.మోహనరావు, సోమేశ్వరరావు, పుల్లెపు వెంకటేశ్వరరావు, యలమంచిలి బాలరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51,116 విరాళం
అంతర్వేది, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం బొగ్గవరపు సత్యనారాయణ-ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.51,116 విరాళం అందించారు. తొలుత వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం దాతకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. కిరణ్, అన్నదానం స్వామి పాల్గొన్నారు.

గోడిలో విద్యుత్ ప్రమాదం బాధాకరం : ఎమ్మెల్సీ
అల్లవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గోడిలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిన విద్యుత్ ప్రమాదంలో బాలిక లాస్యమాధురి, తల్లి రమాదేవిలు గాయపడడం బాధాకరమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. చిన్నారి చేతిని తొలగించే పరిస్థితి రావడానికి విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. జనావాసాల మధ్య విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కోరారు.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన
అంతర్వేది, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వీవీమెరక నీలంకాయల కాల్వగట్టు తాడి సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి బళ్లారపు సువర్ణరాజు ఇంటి వరకు ఉన్న 106మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులు రూ.5లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3లక్షలతో ఈరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, తాడి సత్యనారాయణ, పప్పుల రమేష్, కూటమి శ్రేణులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మా రహదారిని అభివృద్ధి చేయండి

చిరతపూడి గ్రామస్తులు



అంబాజీపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చిర తపూడి కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ప్రధాన గ్రామంలోకి వెళ్లే రహదారి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి చేయడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారివైపు ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి చూడలేదు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీ విజయం కోసం గ్రామస్థులు కృషిచేసి జనసేన పార్టీ అధిక మెజార్టీ అభ్యర్థి గెలుపొందాలే కృషిచేశాం. అయినప్పటికి మా గ్రామంలో ఉన్న ప్రధాన రహదారి అభివృద్ధిని పట్టించుకోవడంలేదని, బురదమయంగా ఉన్న రహదారి ఫొటోలతో గ్రామస్థులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకూ ఈ రహదారిని పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈరహదారిని 2001లో తారురోడ్డు నిర్మించారని, కాని ఇప్పటి వరకూ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణం రోడ్డును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వీవీమెరక గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

56ఏళ్ల తర్వాత కలుసుకున్నారు


అమలాపురం: బండారులంక పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక


రాజోలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1969-70లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 56 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వివిధ రాష్ట్రాలతో పాటురాజోలు పరిసర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు బందా సూర్యనారాయణ, మాదాసు మోహనరావు మాట్లాడుతూ స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పితాని సత్యనారాయణ, ముళ్లపూడి కేశవరావు, కట్టా చలపతిరావు పాల్గొన్నారు.

ఆనందం పంచుకున్న పూర్వవిద్యార్థులు
మామిడికుదురు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు హైస్కూలులో 30ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారంతా స్కూలు ఆవరణలో కలుసుకుని ఆనందం పంచుకున్నారు. 1995-96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం చదువుల బడిలో కలుసుకుని ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. తాము చేసిన అల్లరి చేష్టలను, ఆనాటిమధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. వారి విద్యాదానం వల్లే తాము ఉన్నత స్థితిలో ఉన్నామని తెలిపారు. స్కూలు స్థలదాత కాశిన లక్ష్మీపతిని ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలుచేసి స్కూలు ఆవరణలో కలియతిరిగి సందడి చేశారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక
అమలాపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ కలయిక అదే చదువులమ్మ చెట్టు నీడన జరిగింది. అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన హెచ్ఎం అయ్యగారి శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు దంగుడుబియ్యం శ్రీరామమూర్తి, వంగా సత్యనారాయణ, చింతామణి, ఎంఏకే భీమారావు, వాసంశెట్టి నాగేశ్వరరావు, పుణ్యలక్ష్మి, మట్టపర్తి సత్యనారాయణలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదికవద్దకు విద్యార్థులు తీసుకుని వచ్చారు. ఉపాధ్యాయులను సత్కరించి పాదపూజలు నిర్వహించారు. తరగతి గదుల్లో ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. దంగేటి రుద్రప్రసాద్, యిళ్ల రమేష్‌బాబు, లక్కింశెట్టి రాజేంద్ర, గుత్తుల డీఆర్, కొప్పాడి నాగరాజు, గుత్తుల సత్తిబాబు, బళ్ల బోసు, బాసిన చందు, లక్ష్మీప్రసన్న, మోహనలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు రాష్ట్ర,రాష్ట్రేతర ప్రాంతాల్లో స్థిరపడ్డ మిత్రులంతా కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

చల్లపల్లిలో వైభవంగా అమ్మవారి జాతరలు


మహిషాసురమర్ధని, మరిడిమహాలక్ష్మి

ఉప్పలగుప్తం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో ఏటా సంక్రాంతికి జరిగే కనకమహాలక్ష్మి, మహిషాసురమర్ధని, మరిడిమహాలక్ష్మి అమ్మవార్ల జాతరలు వైభవంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం ఆడపడుచులుగా భావించే అమ్మవార్లను పండుగకు ముందు పుట్టింటికి తీసుకువస్తారు. సంక్రాంతి మూడు రోజులు కనక మహాలక్ష్మి జాతర జరిగింది. అనంతరం మహిషాసురమర్ధని జాతర నిర్వహించారు. శనివారం రాత్రి మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర జరిగింది. సుంకర, పోలిశెట్టి, దంగేటి వంశీయుల ఆధ్వర్యంలో ఈజాతరలు నిర్వహిస్తారు. భోగి పండుగ రోజు మొదలు ఇప్పటి వరకు ప్రతి రోజు ఆలయాల్లో కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈముగ్గురి దేవతలను తమ ఇంటి ఆడపడుచులుగా భావించి ప్రతి ఏటా వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతాలు, సాగనంపే కార్యక్రమాలు జరిపిస్తారు. ఎక్కడెక్కడో ఉన్న చల్లపల్లి గ్రామ ఆడపడుచులు ఈజాతరలకు విధిగా హాజరవుతారు. ఈనెల20నఅమ్మవార్లను చీరసారెలతో సాగనంపుతారు. ఈవేడుకల్లో ఆడపడుచులు ప్రధాన భూమిక పోషిస్తారు.

గ్రామదేవతల జాతర ఉత్సవాలు

ధనమ్మతల్లి అమ్మవారు

అల్లవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియులకు ఇలవేల్పులుగా అల్లవరం మండలం ఎన్.రామేశ్వరంలో పూజలు అందుకుంటున్న గ్రామ దేవతలు ధనమ్మతల్లి, కాళికమ్మతల్లి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గరగ నృత్యాలు, నిప్పుల గుండం తొక్కడం నిర్వహించారు. ధనమ్మతల్లి, కాళికమ్మ అమ్మవార్లను గ్రామస్తులు కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అంగాని శ్రీను, అంగాని రామారావు, చక్కా సత్తిబాబు, చక్కా రాజు, చక్కా వెంకటేశ్వర్లు, బుజ్జి, వెంకటరాము, పంతాడి తాతయ్య అమ్మవార్లను దర్శించుకున్నారు.

కామనగరువు బైపాస్‌లో రోడ్డు ప్రమాదం
వ్యక్తికి తీవ్ర గాయాలు

నుజ్జునుజ్జు అయిన మినీ లారీ

అమలాపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కామనగరువు బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈఘటనలో వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. యూరియా బస్తాలతో కాకినాడ నుంచి పేరూరు వైపు వెళుతున్న లారీ, హైదరాబాద్ నుంచి వై-జంక్షన్ మీదుగా కాకినాడ వైపు వెళుతున్న మినీ వ్యాన్‌లు ఆదివారం మధ్యాహ్నం కామనగరువు జంక్షన్‌లో ఎదురెదురుగా వేగంగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో మినీ వ్యాన్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. లారీలో మినీవ్యాన్ చిక్కుకుపోవడంతో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, నక్కా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానికులు జేసీబీ సాయంతో వాటిని వేరు చేశారు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హైదరాబాద్ ప్రగతి నగర్‌కు చెందిన మినీవ్యాన్ డ్రైవర్ దుప్పల సాయిఈశ్వర్ (30) తీవ్రగాయాలతో వాహనంలోనే చిక్కుపడిపోయాడు. బయటకు తీసిన అనంతరం అంబులెన్సులో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఒక కాలు పాదం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయిఈశ్వర్ అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యానాం బీచ్‌లో కాకినాడ జిల్లా ఎస్పీ బోటు షికారు

గోదావరిలో కుటుంబ సమేతంగా బోటు షికారు చేస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

యానాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ బీచ్‌లో సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వారం రోజులుగా పర్యాటకులు తాకిడి కొనసాగుతోంది. యానాం పర్యాటక శాఖ ఆధీనంలోని సీగల్స్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటింగ్ ద్వారా వృద్ధ గౌతమి గోదావరి నదిలో పర్యాటకులు బోటు షికారు చేస్తున్నారు. యానాంలోని బొటానికల్ గార్డెన్‌కు కూడా పర్యాటకులు అధికసంఖ్యలో వచ్చి ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతున్నారు. ముఖ్యంగా బీచ్‌లో జీసస్‌మౌంట్, భారతమాత విగ్రహం, రాజీవ్‌గాంధీ పార్కు, శివంహోలీబాత్‌లను పర్యాటకులు సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.ఈనేపథ్యంలో కుటుంబ సమేతంగా యానాం వచ్చిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ యానాం పర్యాటక అందాలను వీక్షించి అనంతరం గౌతమి గోదావరిలో బోటు షికారు చేశారు.


మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ జన్మదిన వేడుకలు
అమలాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ జన్మదిన వేడుకలను కోనసీమ వరుణ్ ఫ్యాన్స్ ప్రతినిధి పిండి రాజా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటరమణ థియేటర్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో వరుణ్‌తేజ్ జన్మదిన వేడుకల కేక్‌ను మెగా అభిమాని నల్లా చిట్టిబాబు కట్ చేశారు. థియేటర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెగా అభిమానులు యేడిద శ్రీను, నల్లా నాయుడు, సత్తిబాబురాజు, వెంకటరమణ థియేటర్ యజమాని సుబ్బరాజు, లింగోలు కృష్ణ, నల్లా సాగన్, పోలిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్షాల నిరసన
అమలాపురం టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గో బ్యాక్ అంటూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న అమిత్‌షా తక్షణం వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారాన్ని ముందుచూపుతో గుర్తించి అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేశారని గుర్తు చేశారు. బీజేపీ మతోన్మాద శక్తులు రాజ్యాంగాన్ని తుంగలోతొక్కే విధంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి, సీహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం
మామిడికుదురు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారంచేసి గ్రామానికి చెందిన బొంతు రాంబాబుపై దాడిచేసి గాయపరిచింది. బాధితుడ్ని స్థానికులు నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. మెరుగై వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల గ్రామంలో చాలామంది కుక్క కాటుకు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించాలని కోరుతున్నారు.

రిటైనింగ్ వాల్ ధ్వంసం


అంబాజీపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ధ్వంసం చేయడంతో పాటు పంట చేలకు వెళ్లే సాగునీరు అక్రమంగా కొబ్బరితోటకు మళ్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్థానికులు అడ్డుకున్నారు. మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోట వద్ద నిర్మించిన రిటైనింగ్‌వాల్‌ను సమీపంలోని ఓ రైతు ధ్వంసం చేసి సాగునీరు అక్రమంగా తోటలోకి మళ్లించేందుకు ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. విషయాన్ని ఇరిగేషన్, ప్రజాప్రతినిధులకు తెలియచేయడంతో సంఘటనస్థలానికి చేరుకుని అడ్డుకున్నారు. తక్షణమే భూయజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. రిటైనింగ్ వాల్ ధ్వంసంపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, యథావిధిగా రిటైనింగ్ వాల్ నిర్మించాలని ఆ రైతుకు సూచించినట్లు లస్కర్లు తెలిపారు. నూకపెయ్యి సత్యనారాయణ, భానుప్రకాష్, లోవరాజు, బూర రాజకుమార్, సురేష్‌లతో పాటు పలువురు అడ్డుకున్న వారిలో ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి


మామిడికుదురు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నయినాల నాగమణిభద్రరావు(79) ఆదివారం మృతి చెందారు. ఆయన గతంలో జిల్లాలో టీడీపీ రాష్ట్ర మాజీ రైతు తెలుగు కార్యదర్శిగా, నగరం ఏఎంసీ డైరెక్టర్‌గా, సర్‌ఆర్థర్ కాటన్ రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ రైతు అవార్డును స్వీకరించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి పలువురు టీడీపీ నాయకులతో పాటు రైతులు సంతాపం తెలిపారు.

రమణారావుకు సత్కారం


ఉప్పలగుప్తం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా నిరుపేదలైన రోగ పీడితులు, రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావును ఆదివారం కూనవరంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, పాస్టర్ పందు డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకపల్లి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్నీడివారి కుటుంబ సభ్యుల కలయిక


రాజోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలం కాట్రేనిపాడుకు చెందిన చిట్నీడి అప్పారావు, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు 52మంది సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ధనలక్ష్మికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి సంతానం అందరూ ఒకేచోట కాట్రేనిపాడు రేకపల్లివారి గ్రూపునకు చేరుకుని కుటుంబ సభ్యులతో సందడి చేశారు. ధనలక్ష్మి కుమార్తెలు-అల్లుళ్లు, కుమారుడు-కోడలు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు ఆప్యాయంగా కలుసుకున్నారు. అమెరికా, హైదరాబాద్, కేశవదాసుపాలెం, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులు ఒకేచోట కలుసుకుని సందడి చేశారు. వంటలు వండుకుని సహపంక్తి భోజనం చేశారు. ఉండపల్లి సతీష్, రేకపల్లి భాస్కరరావు, చిట్నీడి విశ్వేశ్వరరావు, కొండపాక మణి, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి వేమన జయంతి
అమలాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యవంతం చేయడంతో పాటు మూఢ విశ్వాసాలను ఖండించిన ప్రజాకవిగా వేమన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రముఖ రచయిత డాక్టర్ పైడిపాల పేర్కొన్నారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢ విశ్వాసాలను తన పద్యాల ద్వారా ఏవిధంగా ఖండించారో ఆయన వివరించారు. కోనసీమ రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో వడ్డిగూడెం వేమన కమ్యూనిటీ హాలులో ఆదివారం వేమన జయంతిని నిర్వహించారు. రెడ్డి జనసంఘం అధ్యక్షుడు తేతల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.శేషారెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, ఎస్.మందేశ్వరరెడ్డి, పి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో జయంతి
ముమ్మిడివరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి వేమన జయంతిని ముమ్మిడివరంలో కళాసాహితీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గల భవనంలో మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన కళాసాహితీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ వేమన పద్యాల రూపంలో ప్రజా విప్లవాన్ని సృష్టించిన మహోన్నత వ్యక్తి అన్నారు. వేమన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పి.విజయ్‌కుమార్, విత్తనాల వరప్రసాద్, నేరేడుమిల్లి అబ్బులు, కవిశ్రీ నాగేంద్ర, మెల్లం దుర్గాప్రసాద్, గెడ్డం శ్రీను, దేవరపల్లి సత్యనారాయణ, లంకే హరీష్ పాల్గొన్నారు.

కామిశెట్టికి ఘన నివాళి
యానాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్, యానాం మాజీ ఎమ్మెల్యే దివంగత కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు వర్ధంతిని యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జిప్మెర్ జంక్షన్ వద్ద గల ఇందిరాగాంధీ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి ఇన్‌చార్జి పరిపాలనాధికారి డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్ఐలు శేరు నూకరాజు, మురుగానందం కామిశెట్టి కుటుంబ సభ్యులు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. యానాం సమాచార శాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ క్రీడా పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ
యానాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిస్ట్రిక్ స్పోర్ట్స్ క్రీడా ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నిర్వహించిన డిస్ట్రిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో యానాం క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. యానాం క్లబ్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి ఉమమాహేశ్వరరావు ఆధ్వర్యంలో యానానికి చెందిన క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు. వీటిలో 60ఏళ్లపైబడిన వారిలో 400మీటర్ల నడక పోటీ, వాలీబాల్, షాట్‌పుట్, జావలిన్ త్రో విభాగాల్లో ప్రథమస్థానంలో చింతం రామకృష్ణ నిలిచారు. 100మీటర్ల పరుగులో ద్వితీయస్థానంలో, ముబారక్‌ఖన్ షటిల్ డబుల్స్‌లో, సింగిల్స్, వాలీబాల్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. నందిగోళ్ల రామాంజనేయులు వాలీబాల్‌లో ప్రథమ, షాట్‌పుట్ జావలిన్‌లో తృతీయస్థానం, 100మీటర్ల పరుగులలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ సాధించిన వారిని యానాంక్లబ్ ప్రతినిధులు అభినందించారు.

సాయిబాబా జయంతి
అమలాపురం టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు పిండి సాయిబాబా జయంతిని అభిమానులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద సాయిబాబా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయిబాబా పార్టీకి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, పడాల నానాజీ, తిక్కా ప్రసాద్, ఆకుల బుజ్జి, కొప్పుల నాగమానస, గోకరకొండ లక్ష్మణరావు, మోటూరి వెంకటేశ్వరరావు, లింగోలు కృష్ణ, పిండి అమరావతి తదితరులు పాల్గొన్నారు.

"ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు" ప్రకటన 14:13
† పరలోక పిలుపు †

మా అందరికీ ప్రేమ, ఆప్యాయతలను పంచిన మంచిమనిషి, VRO గా ఎనలేని సేవలందించిన ఆదర్శమూర్తి
కీ॥శే॥ శ్రీ తాతపూడి మనోహరం గారి
అకాల మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ..
భార్య: తాతపూడి ప్రమీల మరియు కుటుంబసభ్యులు
కీ॥శే॥ శ్రీ తాతపూడి మనోహరం గారు
Rtd. VRO
జననం: 13-04-1966 మరణం: 11-01-2025
ఆదరణకూడిక: ది.23-01-2025 గురువారం ఉదయం 10 గం॥ నుండి చందమామ లేఅవుట్ వేగాయమ్మపేటలో జరుగును.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ. 5,12,580 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ర్యాలి ఆలయంలో అడిషనల్ కమిషనర్ పూజలు

ఆత్రేయపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం జీఎస్టీ అండ్ కస్టమ్స్ అడిషనల్ కమిషనరు కాకరాల ప్రశాంత్‌కుమార్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈవో రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం వారికి అందజేశారు.



కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఘనంగా ముత్యాలమ్మ జాతర



రాయవరంలో ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు

రాయవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు పోలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు జాతరను ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో జరిపారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతో పాటు, మహిళలు తలపై నందా దీపాలను ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తొలుత వెలమపేట రామాలయం వద్ద నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు గ్రామోత్సవం జరిపారు. సోమవారం పోలమ్మ అమ్మవారి జాతర, మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నౌడు వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవార్ల జాతర

ఆత్రేయపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఆదివారం గ్రామదేవత పద్మాల వెంకమ్మ, ఆకులమ్మ జాతరలు భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆదివారం జరిగిన ఈ జాతరలో అమ్మవార్ల ఉత్సవ కమిటీలు వేర్వేరుగా జాతరలు జరిపారు. ఇందులో భాగంగా వెంకమ్మ అమ్మ వారిని గౌతమి గోదావరి వద్దకు తీసుకుని వెళ్ల పూజలు చేశారు. అనంతరం గరగనృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు.



మెర్లపాలెంలో జరిగిన జాతరలో పాల్గొన్న భక్తులు

24న మున్సిపల్ సమావేశం

మండపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ ప్రత్యేక సమావేశం 24న జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతీవాడ నూకదుర్గారాణి చెప్పారు. ఈ సమావేశంలో బడ్జెట్‌తోపాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పలు అంశాలు ఉంటాయన్నారు. సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులకు నిధుల జబ్బు

• పెద్ద రోగాలకు పక్క జిల్లాలే గతి • కూటమి ప్రభుత్వం స్పందించాలని పట్టణవాసుల వినతి



మధ్యలో నిలిచిపోయిన వంద పడకల ఆసుపత్రి భవనం పనులు

మండపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండపేటలోని పెద్దకాల్వ సమీపంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు నిధుల కొరతతో ముందుకు సాగటం లేదు. ఇప్పటి వరకు వంద పడకల ఆసుపత్రికి అనుమతులు లేనప్పటికీ పలు మార్గాల్లో నిధులు సమీకరించి వాటి పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వంలో 30 పడకల ఆసుపత్రికి అనుమతులు మంజూరు చేసింది. తదనంతర పరిణామాల మధ్య 50 పడకల ఆసుపత్రికి అనుమతులు మంజూరు చేసి, నిధులు మాత్రం ఇవ్వలేదు. 2021 అక్టోబర్‌లో ఆసుపత్రి పనులకు శంకుస్థాపన జరిపారు. అప్పటి నుంచి నేటికీ వీటి పనులు ముందుకు సాగలేదు. పట్టణంలో 65వేల జనాభాకు ప్రస్తుతం వున్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం చాలడం లేదు. మండపేటతోపాటు పరిసర గ్రామాల వారంతా ఈ ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రిస్థాయి పెరిగితే ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎండీలు, ఎంఎస్‌లు, ఎముకల వైద్యులు, మత్తు వైద్యులు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండపేట ఆసుపత్రిలో సరైన వసతులు లేకపోవటంతో అత్యవసర వైద్యసేవలకు ఇక్కడ నుంచి రాజమహేంద్రవరం లేదా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను పంపిస్తున్నారు. ఇక్కడ నిర్మించే ఆసుపత్రికి గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పిల్లి సుభాష్ చంద్రబోస్ కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా ఇక్కడ ఆసుపత్రి నిర్మాణానికి అడుగుపడింది. వాస్తవానికి 100 పడకల ఆసుపత్రికి అనుమతులు రానప్పటికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనుమతులు పొందవచ్చనే ధీమాతో వీటి పనులు చేపట్టారు. ఆసుపత్రి కోసం పట్టణంలో వున్న ఎఫ్‌సీఐ గోదాములకు సంబంధించిన 3.6 ఎకరాల భూమిని తీసుకుని అందులో పనులు చేపట్టారు. గిడ్డంగుల శాఖకు సంబంధించి బిక్కవోలు తరలించేలా చర్యలు తీసుకున్నారు. అన్ని వసతులు కల్పించేలా జీప్లస్ 2 విధానంలో ఆసుపత్రి పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయి ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

మండపేటలో కనీసం 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే దానికి అనుగుణంగా పలు విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారు. సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. అత్యవసర సేవల కోసం రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లాల్సిన పని ఉండదు. కిడ్నీ, డయాలసిస్ సేవలు కూడా లభ్యం కానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం కోసం నాబార్డు నుంచి రూ.5.48 కోట్లు, మున్సిపాల్టీ జనరల్ ఫండ్ నిధుల ద్వారా వీటి పనులు చేపట్టారు. వాస్తవానికి వీటి పనులు 2022కల్లా పూర్తి కావాల్సి ఉంది. నిధుల కొరత వల్ల ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందాన ప్రభుత్వ ఆసుపత్రి పనులు ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆసుపత్రి పనులకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాల సేవలు వినియోగించుకోండి

కమిషనర్ రంగారావు

మండపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మంగళవారం నుంచి 24 తేదీ వరకు, మళ్లీ 27 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ క్యాంపు కేంద్రాలు ఉంటాయన్నారు. మంగళ, బుధవారాల్లో న్యూకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. పట్టణవాసులు ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆర్థికసాయం అందిస్తున్న మంత్రి సుభాష్

ఆర్థికసాయం అందజేత

ద్రాక్షారామ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన యర్లగడ్డ శ్రీను అకాల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.25 వేలు అందించి వారిని ఓదార్చారు. ఇటీవల గ్రామంలో మృతి చెందిన కోనపరెడ్డి వరలక్ష్మి, తుమ్మరపల్లి మంగలక్ష్మి కుటుంబీకులను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యోదయ చారిటబుల్ ట్రస్టు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 25 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పెట్టా రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 5 మంది ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడిసిన్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందించారు. ముఖ్య అతిథులుగా రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ, ఎంఈవో చోడిశెట్టి ఆంజనేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంబేడ్కర్, ఎం.సత్యనారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్, విద్యోదయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గుణవంతుడు, రాఘవులు, శ్రీను, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మామిడికుదురు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదుచేసినట్టు నగరం హెచ్‌సీ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. పదో తరగతి చదువుతోన్న తమ కుమార్తె ఆదివారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం బొగ్గవరపు సత్యనారాయణ-ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.51,116 విరాళం అందించారు. తొలుత వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం దాతకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

మామిడికుదురు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారంచేసి గ్రామానికి చెందిన బొంతు రాంబాబుపై దాడిచేసి గాయపరిచింది. బాధితుడ్ని స్థానికులు నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. మెరుగై వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల గ్రామంలో చాలామంది కుక్క కాటుకు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కలను నిర్మూలించాలని కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి కైలాసభూమి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు



కైలాసభూమి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దాతలు, ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కైలాస భూమిని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ఆదివారం కైలాస భూమి చివరి దశ పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అంత్యక్రియలు చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త నంబూరి రెడ్డియ్య, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కు రజతోత్సవ సేవా పురస్కారం అందజేత

ఆత్రేయపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీకి చెందిన ఇంద్ర జాలికుడు, మనస్తత్వవేత్త చింతా శ్యామ్ కుమార్ ఆదివారం రజతోత్సవ సేవా పురస్కారం అందుకున్నారు. కోనసీమ చిత్రకళా పరిషత్ 37వ వార్షికోత్సవం సందర్భంగా అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో కళా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు నుంచి అవార్డు అందుకున్నారు. శ్యామ్ ఇచ్చిన బ్లైండ్ ఫోల్డ్ ప్రదర్శన ఆకట్టుకుంది. కళా పరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామస్వామి నుంచి అవార్డు అందుకున్నారు.



శ్యామ్ జాదుగర్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

రేషన్ డీలర్ల పరీక్షా కేంద్రం పరిశీలన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల ఎంపికకు ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశీలించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థలో నిర్వహించిన పరీక్షకు 135 మందికిగాను 127 మంది హాజరుకాగా, 8 మంది గైర్హాజరయ్యారు. తహశీల్దార్ ఎం.సావిత్రి, ఎంఈవోలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కొత్తపేట: కొత్తపేట డివిజన్ పరిధిలో 61 రేషన్ షాపులకు సంబంధించి రేషన్ డీలర్ల నియామకానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత పరీక్ష జరిపారు. ఈ పరీక్షకు సుమారు 109 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఎంఈవో ఎం.హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.





కొత్తపేటలో రేషన్ డీలర్ల రాత పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్. పక్క చిత్రంలో రామచంద్రపురంలో పరీక్షా కేంద్రం తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: RAMACHANDRAPURAM

I.P. No. 22/2024

Between

Juthuka Tarun, S/o. Chandra Rao, Age 30 Years, Occ Nil, D.No. 2-52/A, Jithuka Palem St., Thotapeta, Draksharamam, Ramachandrapuram Mandal, Ramachandrapuram JCJC ... Petitioner

And

Palika Satyanarayana & 2 others ... Respondents

Respondents:

1 **Palika Satyanarayana,** S/o / Venkat Rao, Age 62 Years, Occ: Business, R/o. D.No.1-257, Palika vari Veedhi, Annayipeta, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
2. **Gubbala Mohana Rao** S/o.Veera Raghavulu, Age 64 Years, Occ: Business, R/o. Palika vari Veedhi, Annayipeta, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
3. **Degala Narasimha Murthy,** S/o. Seshagiri, Age 31 Years, Occ: Business, R/o. D.No 2-56, Kothapeta Karapa Village, Karapa Manda, 533260, Kakinada District.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టు వారి ఎదుట పిటీషన్ దాఖలు చేసియున్నారు. కావున సదరు పిటీషన్‌లో చూపించిన రెస్పాండెంట్స్ మరియు ఇతర బాకీదారులు ఎవరైనా ఉన్నచో పై శ్రీ కోర్టువారి ఎదుట **ది.31-1-2025 సం॥ తేది ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారాగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలియపరచుకొనవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

D.V.S.N. REDDY, N.V.P. REDDY

G.Mamidada 19-1-2025 Advocates, L.N. Palem, G.Mamidada Pedapudi Mandal, Ph: 84659 55555

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: RAMACHANDRAPURAM

I.P. No. 23/2024

Between

Juttuka Sri Murali Krishna, S/o Chandra Rao, Age: 34 years, Occ: NIL, R/o Door No.2-54/A, Jithuka Palem Street, Thotapeta, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC ... Petitioner

And

Kolisetti Satya Sekhar and 5 others ... Respondents

Respondents:

1 **Kolisetti Satya Sekhar,** S/o Suribabu, Age: 40 years, Occ: Business, R/o Annayipeta, Near Government School, Draksharamam, Ramachandra-puram Mandal, 533262, Ramachandrapuram JCJC
2 **Kolisetti Suribabu,** S/o Seshayya, Age: 60 years, Occ: Business, R/o Annayipeta, Near Government School, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
3. **Anyam Bheema Sankaram,** S/o Dandu, Age: 38 years, Occ: Business, R/o Annayipeta, Near Ramalayam Street, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
4. **Anyam Bujji,** S/o Dandu Age: 40 years, Occ: Business, R/o Annayipeta, Near Ramalayam Street, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
5 **Anyam Dandu, @ Dhana Raju,** Age: 62 years, Occ: Business, R/o Annayipeta, Near Ramalayam Street, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC
6. **Chavakula Durga Rao** S/o Pedda, Age: 36 years, Occ: Business, R/o Jagannaikula Palem, Near Y.S.R. New Houses, Draksharamam, Ramachandrapuram Mandal, 533 262, Ramachandrapuram JCJC.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టు వారి ఎదుట పిటీషన్ దాఖలు చేసియున్నారు. కావున సదరు పిటీషన్‌లో చూపించిన రెస్పాండెంట్స్ మరియు ఇతర బాకీదారులు ఎవరైనా ఉన్నచో పై శ్రీ కోర్టువారి ఎదుట **ది.31-1-2025 సం॥ తేది ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారాగాని హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలియపరచుకొనవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

D.V.S.N. REDDY, N.V.P. REDDY

G.Mamidada 19-1-2025 Advocates, L.N. Palem, G.Mamidada Pedapudi Mandal, Ph: 84659 55555



కంపోస్టు యార్డులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక, మున్సిపల్ సిబ్బంది

కంపోస్టుయార్డుకు నిప్పుతో ఉక్కిరిబిక్కిరి

మండపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీకి చెందిన కంపోస్టుయార్డుకు నిప్పు అంటుకోవటంతో దట్టమైన పొగ కారణంగా పలువురు ఇబ్బందులుపడ్డారు. దీన్ని గమనించిన స్థానికులు మున్సిపల్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. యార్డులో వున్న చెత్తకు ఎవరైనా కావాలని నిప్పుపెట్టారా...? లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అగ్ని ప్రమాదం కారణంగా దట్టమైన పొగలు వ్యాప్తించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్ స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే మంటలను అదుపు చేయటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

యోగి వేమనకు పలువురు నివాళి

ఆలమూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యోగి వేమన పద్యాలను ఆకళింపు చేసుకుని సక్రమ మార్గంలో నడవాలని పలువురు వక్తలు అన్నారు. జొన్నాడలో ఆదివారం వేమనరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతిని జరిపారు. వేమన విగ్రహానికి నాయకులు ద్వారంపూడి దొరబాబు, నల్లమిల్లి రామారెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి తదితరులు నివాళులర్పించారు.



జొన్నాడలో వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



చెముడులంక జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఆలమూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాల తర్వాత తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకుని పూర్వ విద్యార్థులు సందడి చేశారు. చెముడులంక తిర్నాతి సూర్యనారాయణ జడ్పీ హైస్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపారు. ముందుగా అప్పట్లో చదువు చెప్పిన గురువులను సత్కరించారు. దీనికి కృషి చేసిన పూర్వ విద్యార్థులు సుంకర సత్యనారాయణ, ఏవీవీ, గంగిశెట్టి దొరబాబు, గ్రంధి ముత్యాలరావు, పాలూరు వెంకటరమణలను తోటి విద్యార్థులు అభినందించారు.



ఆలమూరు మండలంలో ఎండిపోతున్న దొండపాదులు

దొండపాదులకు గడ్డు రోజులు

• ఎండిపోతున్న పాదులతో నష్టపోతున్న రైతులు

• తలలు పట్టుకుంటున్న వైనం...ఆదుకోవాలని విజ్ఞప్తి

ఆలమూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దొండపాదులు ఉన్నట్టుండి ఒకసారిగా ఎండిపోతుండటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. దీనిపై బోలెడంత ఆశపెట్టుకున్న వారికి తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఆలమూరు మండలంలోని లంక గ్రామాలైన బడుగువానిలంక, మూలస్థానం, చొప్పెల్ల, చెముడులంక, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో వందలాది ఎకరాల్లో దొండసాగు జరుగుతోంది. ఈ ఏడాది వారికి గడ్డురోజులు తలెత్తింది. ఏమైందో ఏమో కాని...ఉన్నట్టు వుండి దొండపాదులు ఎండిపోతున్నాయి. తెగులు నివారణకు పలు రకాల మందులను వాడినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. మూడు నెలలుగా కాయలు వంకర తిరిగి తర్వాత పాదులు పూత రావడం పూర్తిగా తగ్గిపోయి ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఆలమూరు మండలంలో దాదాపు సాగు చేస్తున్న అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

దొండపాదులు ఎండిపోవడంతో నష్టపోతున్నాం



మూడు నెలలుగా దొండపాదులు ఒక్కసారిగా ఎండిపోతున్నాయి. వీటిని రక్షించుకోవడానికి అనేక రకాల మందులను పిచికారి చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. దొండతోపాటు కాకర కాయలకు ఇదే పరిస్థితి ఏర్పడింది. దొండ, కాకర సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆనెం వెంకన్న, దొండసాగు రైతు, జొన్నాడ

కామనగరువు బైపాస్‌లో రోడ్డు ప్రమాదం

అమలాపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కామనగరువు బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈఘటనలో వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. యూరియా బస్తాలతో కాకినాడ నుంచి పేరూరు వైపు వెళుతున్న లారీ, హైదరాబాద్ నుంచి వై-జంక్షన్ మీదుగా కాకినాడ వైపు వెళుతున్న మినీ వ్యాన్‌లు ఆదివారం మధ్యాహ్నం కామనగరువు జంక్షన్‌లో ఎదురెదురుగా వేగంగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో మినీ వ్యాన్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. లారీలో మినీవ్యాన్ చిక్కుకుపోవడంతో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, నక్కా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానికులు జేసీబీ సాయంతో వాటిని వేరు చేశారు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హైదరాబాద్ ప్రగతి నగర్‌కు చెందిన మినీవ్యాన్ డ్రైవర్ దుప్పల సాయిఈశ్వర్ (30) తీవ్రగాయాలతో వాహనంలోనే చిక్కుపడిపోయాడు. బయటకు తీసిన అనంతరం అంబులెన్సులో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఒక కాలు పాదం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయిఈశ్వర్ అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

"ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు" ప్రకటన 14:13

† పరలోక పిలుపు †



మా అందరికీ ప్రేమ, ఆప్యాయతలను పంచిన మంచిమనిషి, VRO గా ఎనలేని సేవలందించిన ఆదర్శమూర్తి

కీ॥శే॥ శ్రీ తాతపూడి మనోహరం గారి

అకాల మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: తాతపూడి ప్రమీల మరియు కుటుంబసభ్యులు

కీ॥శే॥ శ్రీ తాతపూడి మనోహరం గారు Rtd. VRO

జననం: 13-04-1966 మరణం: 11-01-2025

ఆదరణకూడిక: ది.23-01-2025 గురువారం ఉదయం 10 గం॥ నుండి చందమామ లేఅవుట్ వేగాయమ్మపేటలో జరుగును.